# మానవులచే మలమూత్రాలు శుభ్రం చేయించే విధానం
# మానవజాతికే కళంకం

**స్వాతంత్ర్యం** సిద్ధించి 72 ఏళ్ళవుతున్నా ఫ్యూడల్ సంస్కృతిలో భాగమైన అత్యంత హేయమైన వృత్తి ఇంకా కొనసాగుతూనే వుంది. మనుషులే మలం ఎత్తివేసే విపత్కరమైన, అమానవీయమైన వృత్తి ఇంకా సజీవంగానే వుంది. ఎన్ని నిషేధాలు విధించినా ఇది కొనసాగుతుందంటే దళితుల, అణగారినవర్గాల గౌరవాన్ని రక్షించడమూ, చట్టాలు అమలు చేయటంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవు తున్నాయి. సామాజిక వ్యవస్థలో కుల ప్రాతిపదికపై ఇంకా ఆ వృత్తి చేయాలని బలవంతం చేయడాన్ని నిరాకరించలేకపోతున్నాం. 2011 లెక్కల ప్రకారం లక్ష 82 వేల 505 కుటుంబాలు ఈ హేయమైన వృత్తిలో 7,40,078 ఇళ్ళకు జుగుప్సాకరమైన సేవలందిస్తున్నాయి.

పైగా రైల్వేలు కూడా ఈ నీచవృత్తిని కొనసాగించటంలో మొదటిస్థానం ఆక్రమిస్తోంది. రైల్వేట్రాక్‌లు, స్టేషన్లు, ప్లాట్‌ఫాంలపై మలాన్ని తొలగించేందుకు మనుషులను నియమిస్తోంది. ఆధునికత, సాంకేతిక పరిజ్ఞానం దీనికి ప్రత్యామ్నాయం చూపలేకపోతోంది. సెప్టిక్ ట్యాంకులు, మ్యాన్‌హోల్స్, నిలిచిపోయిన మురుగు శుభ్రం చేసే సమయంలో సఫాయి కార్మికులు చనిపోతున్న సంఘటనలు ప్రతిరోజూ వింటూనే ఉన్నాం. వీళ్ళని స్థానిక ప్రభుత్వాలు పనిలో నియమిస్తున్నాయి. ఈ కార్మికుల రక్షణ, ఆరోగ్యంపై ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహ రిస్తున్నాయి. రక్షణ చర్యలు తీసుకోటంలేదు. వీరు చనిపోయినా నష్టపరిహారం చెల్లించకపోగా ఆ నేరాన్ని కాంట్రాక్టర్లు, సబ్‌కాంట్రాక్టర్లపై నెట్టివేస్తున్నాయి.

2013లో ఈ వృత్తిని నిషేధించినప్పటికీ 2019 జులై నాటికి 54,130 మంది ఈ వృత్తిలో కొనసాగుతున్నట్లు ప్రభుత్వ సర్వేనే తెలుపుతోంది. మాన్యువల్ స్కావెంజింగ్ వున్న ప్రాంతాల్లోనే ఈ సర్వే చేపట్టినా ఇంత తక్కువమంది ఈ వృత్తిలో వున్నట్లు రావడం అనుమానాస్పదమే. 18 రాష్ట్రాల్లోని 170 జిల్లాల్లో సర్వే జరిగింది. ఈ వృత్తిలో నియమించినవారిని శిక్షించినట్లు నమోదుకాలేదని సామాజిక న్యాయవాదుల అధికారే లోక్‌సభలో చెప్పారు. ఇవేకాకుండా మురుగు తొలగించే సమయంలో చనిపోయినవారి సంఖ్య కూడా తక్కువగానే చూపుతున్నారు. 1993-2019 కాలంలో తమిళనాడులో 206 మంది చనిపోయినట్లు నమోదయింది. తర్వాత గుజరాత్‌లో 156, యూపీలో 78, కర్ణాటకలో 73మంది మృతిచెందగా 15 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అసలు లెక్కలే సమర్పించలేదు. కేరళలో 20 మంది చనిపోగా వారిలో 83 శాతం మందికి నష్టపరిహారం చెల్లించలేదు. అలాగే బెంగాల్‌లో 63 శాతం మందికి నష్టపరిహారం చెల్లించలేదని సఫాయి కర్మచారీ నేషనల్ కమీషన్ నివేదిక తెలుపుతోంది. స్వచ్ఛ భారత్ టాయిలెట్ నిర్మాణాలపై కేంద్రీకరించిందే గాని ఈ వృత్తిని నిషేధించి అమలుచేయటంపై శ్రద్ధ వహించట్లేదని ఈ కమీషన్ పార్లమెంటుకు తెలిపింది. వీరి పునరావాసానికి ప్రయత్నాలు జరగలేదు. ఇప్పటికీ మధ్యప్రదేశ్‌లో నాన్ సెప్టిక్ టాయిలెట్‌లు నడుస్తూనే ఉన్నాయి.

కులవ్యవస్థే కాకుండా, దారిద్ర్యం కూడా దళితులను ఈ వృత్తి చేపట్టే పరిస్థితులకు దారితీస్తోంది. ఈ అమానుష వృత్తి ఫ్యూడల్ సంస్కృతిలో భాగమైన కులవ్యవస్థ, ఆర్థిక విధానాలు దళితులను గౌరవంగా జీవించే హక్కును కాలరాస్తున్నాయి.

ooo